క్లుప్తంగా

వేంకటేశుడికి పుష్పయాగం



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం పుష్పయాగం ఏర్పాటు చేశారు. కొంగర జోగేంద్ర నగరాజ కుమారి దంపతులు అత్యంత వైభవంగా స్వామి వారి పుష్పయాగ క్రతువును నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తరించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నసంతర్పణ చేశారు. ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పరిశీలించారు.

మందు బాబులపై కేసు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై తాడేపల్లి పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ.. కృష్ణానది తీర ప్రాంతం, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మందు బాబులు మద్యం తాగుతున్నారని.. వారిని అదుపు చేసేందుకు డ్రోన్ కెమెరా ఉపయోగించి గుర్తిస్తున్నామని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

3వ రాష్ట్ర కౌన్సిల్ సభలను జయప్రదం చేయాలి



దుగ్గిరాల: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని ఏపీ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందె బాల చంద్రమౌళి కోరారు. ఈ సందర్భంగా దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చంద్రమౌళి మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న సభలో ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ, తహసీల్దార్ ఐ.సునీత, డిప్యూటి తహిసిల్దార్ బి.కనక దుర్గ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

దుగ్గిరాల: సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆధార్ క్యాంపులను ఈనెల 10వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆధార్ క్యాంపులలో చిన్న పిల్లలకి కొత్తగా ఆధార్ నమోదు, డెమోగ్రాఫిక్, బయోమేట్రిక్ నవీకరణ, మార్పులు, చేర్పులు సరిచేసుకోడానికి వీలు కలుగుతుందని అన్నారు. దుగ్గిరాల సచివాలయం, మోరంపూడి సచివాలయంలో 10, 11వ తేదీల్లో.. సచివాలయం, రేవేంద్రపాడు నార్త్-4 అంగన్వాడీ కేంద్రంలో 12, 13 తేదీల్లో .. సచివాలయం, పేరుకలపూడి సచివాలయంలో 24వ తేదీన క్యాంపులు ఉంటాయన్నారు. పెదపాలెం సచివాలయం, కె.ఆర్.కొండూరు ఎలిమెంటరీ పాఠశాలలో 25వ తేదీన.. చిలువూరు సచివాలయం, పెదకొండూరు సచివాలయంలో 26న.. చిలువూరు సచివాలయం, గొడవర్రు సచివాలయంలో 27న క్యాంపులు నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రౌడీ షీటర్‌పై కేసు నమోదు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరానికి చెందిన ఓ వ్యాపారిపై దౌర్జన్యం చేసి బెదిరించిన కేసులో బందారు రవి అలియాస్ బక్కరవి అనే రౌడీషీటర్‌ను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి సదరు రౌడీషీటర్‌ను జైలుకు పంపినట్లు సీఐ వినోద్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లను అడ్డం పెట్టుకుని నగర పరిధిలోని పలువురిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రౌడీషీటర్లు ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి ఆగడాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.



కోలాహలంగా నిర్వహించిన ర్యాలీలో ప్రజలు



దివంగత డా. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావులు



భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

అట్టహాసంగా వెన్నుపోటు దినం

- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు కార్యక్రమాలు
- ఏడాది కూటమి పాలనపై ప్రజలు ఆగ్రహం
- భారీగా నిర్వహించిన సమావేశాలు, ర్యాలీలు
- కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన నియోజకవర్గ నాయకులు

మంగళగిరి, మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేసిందని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు అన్నారు. బుధవారం వెన్నుపోటు దినం సందర్భంగా మంగళగిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్ రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటి తహసీల్దార్ అంకారావుకు వినతి పత్రం అందజేశారు.



డిప్యూటి తహసీల్దార్ అంకారావుకు వినతిపత్రం అందజేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు

బాబు పాలనలో కక్ష సాధింపు చర్యలు..

మంగళగిరి కార్యక్రమంలో వేమారెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ జీవితం ఎన్టీఆర్‌కు వెన్నుపోటుతోనే ప్రారంభమైందన్నారు. కూటమి ప్రభుత్వంలో బాబు ప్రశ్నించే వారిని అణగదొక్కుతూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ 700 మంది కార్యకర్తలపై హత్యాయత్నాలు, సోషల్ మీడియా యాక్టివేషన్స్ 79 మందిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చే వరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజల తరుపున పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల కన్వీనర్లు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ, బుర్రముక్క వేణుగోపాలస్వామి రెడ్డి, అమరా నాగయ్య, తాడిబోయిన శివగోపయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, దుగ్గిరాల జెడ్పీటీసీ దాసరి అరుణకుమారి, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, మాజీ కౌన్సిలర్ సంకె సునీత, దర్శి విజయశ్రీ, సీనియర్ నాయకులు దామర్ల కుబేరస్వామి, అహ్మద్ బాజీ షాహిద్, ఊట్ల పాల శ్రీనివాసరావు, మేడా వెంకటేశ్వరరావు, మున్నంగి వివేకానందరెడ్డి, గుంటి రాజ్యలక్ష్మి, చిలువూరి ఫిలోమీనా, కట్టెపోగు భూషణం, రత్నాకరం శ్రీనివాస్‌రాజ్, ఈపూరి ఆదామ్, మాదాల గోపికృష్ణ, షేక్ గౌస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మేడికొండూరు: హామీలు అమలు చేయకుండా ఏడాది కాలయాపన చేయడం బాబుకే చెల్లు అని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. బుధవారం తాడికొండ నియోజకవర్గంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత అయిదేళ్ల పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందిందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, శ్రీ శక్తి పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఢిల్లీ నుంచి అప్పులు తెచ్చేందుకు అధికారం చేపట్టినట్టు ఉందన్నారు. తీసుకువచ్చిన అప్పులు ఏం చేశారో తెలియడం లేదన్నారు. డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రోజుకో ధోరణితో డైలాగులు చెప్పడమే కానీ ఆయన వల్ల ప్రజలకు ఉపయోగం ఏమీ లేదని విమర్శించారు. అభివృద్ధిని అటకెక్కించే సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారని అన్నారు. ప్రధానంగా మహిళా శక్తి పేరుతో ఆడపడుచులకు ఇచ్చిన హామీలు తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు వంటి పథకాలను పక్కన పెట్టేశారని.. నీకు రూ.15 వేలు, నీకు రూ.18 వేలు అంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు నేడు చేతులెత్తేశారని విమర్శించారు.



తాహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమ బాల వజ్రబాబు

సామాన్యులు బెంబేలు..

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చక పోగా ఎమ్మెల్యేలు, పోలీసులు, టీడీపీ కార్యకర్తలు సామాన్యులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని వజ్రబాబు ధ్వజమెత్తారు. కబ్జాలు, ఆక్రమణలు, దందాలు, అక్రమ వసూళ్లు అంతు లేకపోవడంతో జనం బెంబేలెత్తుతున్నారన్నారు. కొత్త మద్యం పాలసీ పేరుతో ఊరూవాడలా బెల్ట్ షాపులు పుట్టుకొస్తున్నాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.కార్యక్రమంలో తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడు ముప్పాల మనోహర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వంగా పూలరెడ్డి, దాసరి రాజు, రెడ్డి త్రివేణి, కళ్లం హరికృష్ణా రెడ్డి, రాఘవరెడ్డి, ముచ్చు ఆనంద్, రెడ్డి సాంబిరెడ్డి, రఘువరన్, తుళ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు, బత్తుల కిషోర్, చుండు వెంకటరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, మేడికొండూరు మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, షేక్ రబ్బాని, బొడ్డు పెద్ద సాంబయ్య, కొరివి కిషోర్, కొరివి చెన్నయ్య, కొరివి అజయ్, ముత్యాల బాలస్వామి, గండికోట రసూలు, కోటిరెడ్డి, కిషోర్ రెడ్డి, ఫిరంగిపురం మండల పార్టీ అధ్యక్షుడు, మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, దాసరి సురేష్, చేవూరు రామ్మోహన్ రెడ్డి, చిన్నపరెడ్డి, మిల్కియా, హేమలత రెడ్డి, అప్పి రెడ్డి, తాడికొండ నియోజకవర్గం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం..

తాడికొండ నియోజకవర్గంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో సభ వేదిక వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కాగా వాటిని పోలీసులు అడ్డుకున్నారు. ఫ్లెక్సీలు పెట్టడానికి అనుమతులు లేవని సీఐ వాసు ఫ్లెక్సీలను తొలగించే పనులు చేపట్టారు. దీంతో పోలీసులకు వనమా బాలవజ్రబాబుకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం ఎంతవరకు న్యాయమంటూ ఆయన పోలీసులను ప్రశ్నించారు.



వేదిక వద్ద ఫ్లెక్సీలను తొలగిస్తున్న తాడికొండ పోలీసులు

తాడికొండకు తరలిన నాయకులు..

ఫిరంగిపురం: తాడికొండలో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాలవజ్రబాబు ఆధ్వర్యంలో చేపట్టిన వెన్నుపోటు దినోత్సవానికి మండల కేంద్రంలోని ప్రజలు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి ఆధ్వర్యంలో పలుగ్రామాల నాయకులు, కార్యకర్తలను తాడికొండకు తరలివెళ్లారు. కె.చిన్నప్పరెడ్డి, దాసరి సురేష్‌బాబు, చేవూరి రామమోహన్‌రెడ్డి, పెరికల చిన్న, పి.వెంకట్రామిరెడ్డి, హేమలతా రెడ్డి, కె.ప్రవీణ్‌రెడ్డి, మీరా, బి.అంజిరెడ్డి, టి.కృష్ణలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



తాడికొండకు బయలు దేరిన నాయకులు

పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాలు

మంగళగిరి టౌన్: గతనెల మే 31 నుంచి ఈనెల 2వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన పవర్ లిఫ్టర్లు పతకాలు సాధించినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి విజయ భాస్కరరావు, షేక్‌సంధాని తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ (మెన్, ఉమెన్), బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన మెన్, ఉమెన్, మాస్టర్స్ పవర్ లిఫ్టర్లు పాల్గొని పతకాలు సాధించారని అన్నారు. వ్యక్తిగత పతకాలతో పాటు జిల్లాకు టీమ్ ఛాంపియన్ షిప్ సాధించినట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్ గర్ల్స్ ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం, సబ్ జూనియర్ బాయ్స్ టీమ్ ఛాంపియన్ షిప్‌లో తృతీయ స్థానం, జూనియర్ ఉమెన్ టీమ్ ఛాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానం సాధించారన్నారు. సీనియర్ మెన్, ఉమెన్ టీమ్ ఛాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానం, జూనియర్ మెన్ టీమ్ ఛాంపియన్ షిప్‌లో తృతీయ స్థానం సాధించి ఓవరాల్ టీమ్స్ ఛాంపియన్ షిప్(మెన్, ఉమెన్)లో ప్రథమ స్థానం సాధించి జిల్లా ఖ్యాతిని రాష్ట్ర వ్యాప్తంగా తీసుకు వెళ్లారని తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు, క్రీడా ప్రముఖులు క్రీడాకారులను అభినందించారని తెలిపారు.



గెలుపొందిన పతకాలతో క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు

యూవిన్ పోర్టల్ తప్పనిసరి

ఫిరంగిపురం: గర్భిణులు, చిన్నారులకు సంబంధించిన ఇమ్యూనైజేషన్ (వ్యాక్సిన్) వివరాలు యూవిన్ పోర్టల్‌లో తప్పనిసరిగా ఆరోగ్య సిబ్బంది నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. ఫిరంగిపురం-1 సబ్‌సెంటర్, రేపూడిలోని సబ్‌సెంటర్లను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, 0-6 ఏళ్ల చిన్నారులకు సంబంధించి వ్యాక్సిన్ వేసిన వివరాలు యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. దీనిద్వారా వ్యాక్సిన్‌కు సంబంధించిన సర్టిఫికెట్లను తీసుకోవచ్చన్నారు. వావిలాల సుబ్బరాయ శాస్త్రి, సీహెచ్‌వో వెంకటరమణ, ఎంపీహెచ్ సూపర్‌వైజర్ షేక్.అబ్దుల్ రెహమాన్, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

ఫిరంగిపురం(తాడికొండ): గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన టి.శివనాగరాజు తుళ్లూరు మండలంలోని మందడంలో వినియోగదారుల వద్ద నుంచి కిలో రేషన్ బియ్యం రూ.15 వంతున 380 కిలోలు కొనుగోలు చేశాడు. వీటిని 12 సంచుల్లో నింపి హోటళ్లకి కిలో రూ.20 చొప్పున విక్రయించేందుకు తీసుకు వెళుతున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అదును చూసి తాడికొండలోని పెట్రోలు బంకు సమీపంలో వాహనాన్ని బుధవారం అడ్డుకున్నారు. శివనాగరాజును అదుపులోకి తీసుకుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఫిరంగిపురం(తాడికొండ): మద్యం మత్తులో పురుగు మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన తాడికొండ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్కామల గ్రామానికి చెందిన దమనబోయిన వెంకట శివకృష్ణ(27) గతనెల 30వ తేదీ రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి మత్తులో పురుగు మందు తాగాడు. గమనించిన శివకృష్ణ తల్లి ధనలక్ష్మీ తన బంధువులతో కలిసి చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రయివేటు వైద్యశాలకు యువకుడిని తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌నకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శివకృష్ణ మంగళవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లి స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి రూ.లక్ష విరాళం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ చిర్రావూరు గ్రామంలో నిర్మిస్తున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం టీడీపీ నాయకులు విరాళాన్ని అందించారు. పార్టీ మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ రూ.1,01,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. పార్టీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్, కూరపాటి సంపూర్ణరావు, మానేపల్లి కిరణ్, బూత్ కన్వీనర్ జెట్టి రవితదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు అవగాహన సదస్సు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి మున్సిపల్ సమావేశ మందిరంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో ల్యాప్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అందరూ తమ బ్యాంకులో పరపతిని పెంచుకోవాలని.. సంపాదనలో 20 శాతం తప్పకుండా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంక్ సేవల కోసం ఇతరులపై ఆధారపడకూడదని అన్నారు. ల్యాప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ.. ప్రతి ఖాతాదారుడు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. మెప్మా పట్టణ కమిటీ ఆర్గనైజర్ పద్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి బ్యాంకు సేవలను మన పరిసర ప్రాంతాల్లో అందరికీ తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్త విప్పర్ల విజయ భాస్కర్, ల్యాప్ సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, తురకా మంగయ్య, పట్టణ ఆర్పీ అధ్యక్షురాలు రాణి, విజయకుమారి, రమాదేవి, దుర్గా ఇంద్రాణి, నాగేశ్వరరావు, శౌరయ్య, వివిధ సంస్థల ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



అవగాహనా సదస్సులో పాల్గొన్న ఆర్పీలు

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం గుండాలపాడు గ్రామంలోని పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే పెద్ద సంఖ్యలో మహిళలు బిందెలతో పసుపు, గంధంతో కూడిన నీరు తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు చేశారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం కార్యదర్శి కె.పెద్దబాబు, సర్పంచ్ కె.దాసయ్య, ఎం.కోటేశ్వరరావు, బొల్లారావులు, భక్తులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఫిరంగిపురం(తాడికొండ): పెదకాకాని మండలం ఎన్టీఆర్ కాలనీకి చెందిన రహీం, కరిముల్లాలు అన్నదమ్ములు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలోని మామిడి తోటకు ఈనెల 1వ తేదీన వీరిద్దరూ వెళ్లారు. అక్కడ చెట్టుకు ఉన్న మామిడి పండ్లను కరిముల్లా కోస్తుండగా తోట యజమాని కోపంతో వచ్చి ఇనుపరాడ్డుతో గాయపరిచాడు. దీంతో రహీం తోట యజమానిని అడ్డుకొని కరిముల్లాను గుంటూరులోని జీజీహెచ్‌కు చికిత్సకోసం తీసుకువెళ్లాడు. దీనిపై రహీం బుధవారం తాడికొండ పోలీసులకు దాడి చేసిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.